# మినీ కథ

## "కావలెను"

నిరుపమ త్యాగశీలి, ఆశ్రిత జన రక్షకుడు, నిత్య సత్యవ్రతుడు, పండిత జనో ద్ధారణానురక్తుడు, నిత్యాగ్నిహోత్రుడు, అతులిత పానపపాని, నానా భాషా పండితుడు, బృహస్పతినిమించిన బుద్ధిమంతుడు. కుటిల రాజనీతిలో చాణక్యుని మించినటు వంటివాడు, నిస్వార్థ ప్రజాసేవాతత్పరుడైన ఒక మాజీ మంత్రి మా చపటాపుర పంచాయితీ సమితికి అధ్యక్షత వహించుటకు కావలయును. ఈ పదవీ బాధ్యత వహించుటకు క్రింద పేర్కొనబడినటు వంటి అర్హతలు గలవారు మాత్రమే అర్హులు.

1. వయస్సు :- సాధారణంగా అరువది సంగలు మించిన "యువకులు" మాత్రమే ఈ పదవీ సుదతిచేత వరింపబడెదరు. హృద్రోగము లేని వారు అనర్హులు.

2. కనీస విద్యార్హతలు :- ఆంగ్లాంధ్ర భాషలలో పాండిత్యం ఉండితీరాలనే నియమం లేదు. ఈ రెండు భాషలూ కలిపి అనర్గళంగా ఉపన్యసించగల వ్యక్తులకు తంకర వేయబడుతుంది. (తంకర వేయుట అనగా మా గ్రామం భాషలో అమోదం (కంకరెన్స్) ఇచ్చారు అని అర్థం:) తెలుగు వ్రాయటం, చదవటం తెలియక పోయినా అంగ్లంలో సంతకం చేయుటం (ఇతరులు ఫోర్జరి చేయుటానికి అవకాశం లేకుండా:) వచ్చియుండాలి. జాతీయ భాషపై గౌరవముండాలి. తమిళ భాష వచ్చి యుండటం అదనపు అర్హతగా భావిస్తాం.

3. అనుభవము :- ఈ ప్రకటన మొదటి పేరాలో వర్ణించిన విధంగా అపూర్వమైన అనుభవం ఉండి తీరాలి. ఇకపోతే, నిత్యవ్యవహారాలకు కావలసిన అనుభవమెట్టిదనగా కనీసం నాలుగయిదు సార్లన్నా ఎలక్షన్లలో పోటీచేసి ఉండాలి. ఎలక్షన్లలో ప్రచారం చేయునప్పుడు ఉపయోగించే యుక్తులు, చతురభాషణ, ఏ ఎండకాగొడుగు పట్టు టక్కరితనం తెలిసియుండాలి. అవసరమైనప్పుడు అతిసునాయాసంగా హత్యలు, దోపిడీలు మానభంగాలు చేయగల లేక చేయించగల చాతుర్యం ఉండాలి. కేంద్ర మంత్రివర్గంలో ఉపమంత్రిగా గాని, రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రిగాగాని (ఏ శాఖ అయినా సరే:) కనీసం అయిదు సంవత్సరాలైనా నిరాటంకంగా నిర్వహించిన అనుభవముండాలి.



## మండల ఎన్నికల ప్రత్యేకం

ఉపన్యాసా లివ్వడంలోను, దండలు వేయించు కోవడంలోను, ప్రారంభోత్సవాలు చేయునప్పుడు రిబ్బన్లు కత్తిరించటం లోను, ప్రజాధనాన్ని తరతమ బేధం లేకుండా స్వంతం చేసుకోవడంలోను, ఎట్టివారినైనా మాటల్లో బోల్తా కొట్టించడం లోను, వినకపోతే బెదిరించి, భయపెట్టి, వీలైతే వధించైనా సరే, తన మార్గాన్ని నిష్కంటకం చేసుకొన నేర్పుగలిగిన మహా జిత్తులమారిని ఈ పదవీ సుందరి వరిస్తుంది. అగ్నిబాధితుల సహాయార్థమనో, వరదబాధితుల కన్నీరు తుడుచుటకనో, కరువుపీడితుల కడగండ్లు మాన్పుటకనో ఏదో ఒక కట్టుకథను సమయానుకూలంగా అల్లి చందాలు వసూలు చేయగల నేర్పుండినచో అది ప్రత్యేకార్హత కాగలదు.

4. విశేషార్హతలు :- (1)మన రాష్ట్రంలోని ఏజిల్లాలోనైనా పౌరసత్వం కలవారు మాత్రమే ఈ పదవికి పోటీ పడుటకర్హులు. ఎట్టి పరిస్థితులలోనూ అన్యప్రాంతీయుల దరఖాస్తులు పరిశీలింపబడవు. (2) దరఖాస్తుదారుడు పరువు ప్రతిష్టలను, వంశగౌరవాన్ని, మాన మర్యాదలను, సిగ్గు బిడియాలను, నీతి నిజాయితీలను, అంతరాత్మను వదిలివేసుండాలి. (3) "ప్రజానాయకుడు" సినిమాలో వర్ణించిన విధంగా 'కారు లేకపోయినా, కాఫీ లేకపోయినా, పరువు మర్యాదలను పట్టపగలు పబ్లిక్‌గా నడిబజారులో వేలం వేస్తున్నా, కట్టుకున్న పెళ్ళాం పక్కింటి వాడితో లేచిపోయి, ఎదురింట్లో కాపురముంటున్నాసరే బ్రతకొచ్చు కానీ పదవి లేకపోతే అరక్షణమైనా బ్రతకలేము' అనువిధంగా పదవీ వ్యామోహితుడయ్యుండాలి: (4) మొఖం మీద ఉమ్మేస్తే తుడిచేసుకొని, షేక్హ్యాండ్ ఇవ్వగల శాంతం, సహనం ఉండాలి. (5) పరాయి స్త్రీలను తమ బిడ్డలకు తల్లులుగా భావించి గౌరవించగల ఔదార్యం ఉండాలి. (6) దరఖాస్తుదారుడు నల్లధనం కలవాడు, అక్రమనిల్వదారుడు, అక్రమ సరుకు రవాణాదారుడు, హస్తలాఘవం కల పెద్దమనిషి అయితే మరీ మంచిది. (7) ఢిల్లీలో పలుకుబడి కలిగిన ఒక ప్రజానాయకుని ప్రాపునైనా సంపాదించి ఉండాలి. (8) అవసరమయితే నినాదాలు చేసేవాళ్ళని, ప్రతిపక్షాల మీటింగులను అల్లరిచేసే తుంటరులను, పోటీదారులను ఎముకలలో సున్నంలేకుండా బాగా చితక కొట్టగల సామర్థ్యం ఉండాలి. (9) మీదు మిక్కిలి తెల్లటోపీల సంఘంలో సభ్యత్వం పొందియుండాలి.

5. పదవీ బాధ్యతలు :- పంచాయితీ సమితిలోని సభ్యులనందరినీ ఒకేతాటిపై నడిపించగల సామర్థ్యమవసరం. సమితి మీటింగులను క్రమం తప్పకుండా జరిపించాలి. సమితి కంట్రోలుక్రింద వున్న ప్రాంతాలలో జరిగే పబ్లిక్ వర్క్సుకు, వ్యవసాయ, ప్రజారోగ్య కార్యకలాపాలకు పూర్తి బాధ్యత వహించాలి. సమితి ఆదాయ వ్యయ పట్టీకను సిద్ధం చేయవలసిన బాధ్యతకూడా పంచాయితీ సమితి అధ్యక్షుడిదే: ఇంజనీర్లు మొదలుకొని పి.డబ్ల్యు.డి. ఇంజనీర్లు వరకుగల ప్రభుత్వోద్యోగుల శ్రేయస్సుకు, కంట్రాక్టర్ల క్షేమానికి పూర్తి బాధ్యత వహించవలసి యుంటుంది. లేడీ డాక్టర్లపైన, పంతులమ్మలపైన, గ్రామసేవికలపైన, ప్రభుత్వాసుపత్రులలోని నర్సులపైన ప్రత్యేకాభిమానం కనబర్చాలి. అయిదు సంవత్సరాల కొకసారి జరిగే జనరల్ ఎలక్షన్లకు, అప్పుడప్పుడు జరిగే బై ఎలక్షన్లకు, సమితి పాలనలోనున్న

# మినీ కథ

నియోజక వర్గాల ప్రజలపై విరివిగా ఖర్చు చేయుటకు కావలసిన నిధులను ప్రోగు చేస్తుండాలి. సమితి కార్యకలాపాలను పరిశీలించే నెపంతో క్యాంపులు వేసే మంత్రి వర్యులకు, వారి ఆశ్రితులకు, అధికారులకు అనధికారులకు వలయు వసతి, భోజన విశ్రాంతి విలాసాలు అందుబాటులో వుంచే ఏర్పాట్లను ఆయాసమయాలలో స్వయంగా చూడాలి.

**6.** జీత భత్యాలు :- అర్హతలు, అనుభవాన్ని బట్టి నిర్ణయింపబడతాయి.

పైన పేర్కొన్న అర్హతలు గలవారు వచ్చే జనరల్ ఎలక్షన్లకై నామినేషను దాఖలు చేయులోపల తమ దరఖాస్తులందు నట్లు అప్లయి చేసుకోవాలి. కాగితంపై ఒక వైపు మాత్రమే తెలుగులో సిరాతో వ్రాసి లేక వ్రాయించి పంపాలి. సంతకం ఆంగ్లంలో చెయ్యాలి. అర్హతలు, అనుభవాలను బట్టి దరఖాస్తుదారుల జాబితా తయారుచేయబడుతుంది. ఢిల్లీలోని అధిష్ఠాన వర్గంవారు జాబితాలోనున్న పేర్లలో నొకదానిని ఆమోదించి రాష్ట్రి అధినేతకు తెలియజేసిన తర్వాత సఫలీకృతుడైన దరఖాస్తుదారునికి వర్తమానం పంపబడుతుంది. (సిఫార్సులు చెల్లనేరవు) అప్లికేషనుతోబాటు ఇటీవల తీసిన రెండు ఛాయా చిత్రాలను, తమ ప్రవర్తన, నిజాయితీలను సర్టిఫై చేయుటకు ఇద్దరు ఘరానా పెద్దమనుష్యుల పేర్లు, చిరునామాలను కూడా తెలియబరుస్తూ ఈ క్రింద ఇవ్వబడిన ఎడ్రసుకు గడువు ముగిసేలోపల అందునట్లు పంపవలెను. ఆ తర్వాత మా కార్యాలయమునకు చేరిన దరఖాస్తులు ఎంతమాత్రమూ పరిశీలింపబడవు. (అవసరంవస్తే తప్ప)

ఇట్లు
అహోబిలం అప్పారావు
సెక్రటరీ
పంచాయితీ సమితి కార్యాలయము,
420, గుంట నక్కల వీధి
చవటాపురం (ఆంధ్రప్రదేశ్)

గమనిక :-
(ఇది ప్రత్యేకించి కేవలం హాస్యం కోసమే తప్ప ఎవరినీ ఉద్దేశించి కాని, నొప్పించటానికి కాని వ్రాసినది కాదు)



**వి. శ్రీనివాసరావు**
(గుంటూరు)

## మీరేం చేస్తారు?

*ప్రవంతి నెం: 17లో 'మీరేం చేస్తారు'లో ఇచ్చిన*

*ఓరోజు మీ స్నేహితుడి బదులు మీరే రైల్వే స్టేషన్ మాస్టర్‌గా ఉండాల్సి వస్తే? విషయానికి ఎన్నికైన సమాధానాలు. మొదటి ఇద్దరికి ఒక్కొక్కరికి పదిరూపాయలు పారితోషికం.*

- ఆనందం పట్టలేక రైలుకూతలాగా అరుస్తాను. ముందుగా స్టేషన్ మాస్టర్ (ఎస్.ఎం) రూంలోని ఫేన్, ఛైర్స్ వగైరా ఫర్నిచర్ అంతా మా ఇంటికి పంపిస్తాను. పచ్చ జెండాలు, ఎర్ర జెండాలు స్వాధీనపరచుకొని పిల్లలకు పది నిక్కర్లు నాకు ఐదు డ్రాయర్లు కుట్టించుకొంటాం. తర్వాత రెడ్ సిగ్నల్ లైట్‌ను ఇంటికి తీసుకెళ్ళి, అప్పులవాళ్ళ రాకను తెలియజేసేలా అమర్చుకొంటాను. ఒక గూడ్స్ బోగీని ఇంటికి తరలించుకొంటాను. అది నా స్పెషల్ రూంగా మార్చుకొంటాను. ఒకో ఎక్స్‌ప్రెస్ బండి నుండి ఒకో బోగీని పేదవానికి 15 రూ॥ చొ॥న అమ్ముకొంటాను. చివరిగా ఇంజన్ కూడా రూ. 16-50 లకు ఎవరికైనా అమ్మేస్తాను. కావలసినవారు సంప్రదించవలసిన చిరునామా,
—వి. మధుసూదన్‌రావు, గోపిస్ట్రీట్
పులివెందుల, (కడప జిల్లా)
- ఆః! రైల్వే డిపార్ట్‌మెంటేకదా! స్నేహితుడికి బదులు డ్యూటీకి వెళ్ళాల్సిన రోజు హాయిగా రెస్టు తీసుకొని, మర్నాడు వెళ్ళి డ్యూటీలో జాయినవుతాను. —యస్.వి. వేంకటరమణ
సన్నాఫ్ యస్.వి. వేంకటాచార్య
ఇం. నెం. 4-2-54,
కొత్తూరు, హన్మకొండ-506001
- "అమ్మో ఇలాంటి ఛాన్సు మళ్ళీరాదు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. మా ఆవిడ మొన్నటినుండి పుట్టింటికి పంపించండి! అంటూ తెగ బాధపెట్తేస్తుంది ఈరోజు ఫ్రీగా బండెక్కించి పంపేస్తాను.
—యం. శ్రీనివాసరావు (బెల్లంపల్లి)
- ఒకరోజు లేటుగా వెళ్తానండీ!
—వి. రాజేశ్వర్ (హాస్పిటల్)
- ఎంతో కాలంగా ఉన్న నాకోర్కె నెరవేరబోతోందన్నమాట. రైళ్ళు రైళ్ళు ముద్దాడ్తాయని మా స్నేహితుడనేవాడు అలా రైళ్ళు ముద్దాడేలా చూస్తాను
—సి.వి. కొండయ్య (పాలకొల్లు)
- కరెక్ట్ టైమ్‌కు వచ్చే సూపర్ ఎక్స్‌ప్రెస్ ఆపేసి, లేటుగా వస్తున్న ప్యాసింజర్‌ని ఆపకుండ పంపేస్తాను.
—యస్. హమీద్ (గూడూరు)
- నేను స్టేషన్ మాస్టరునయితే సిగ్నల్స్ తీసేయిస్తాను. క్యాబిన్స్ మూసేయిస్తాను. టిక్కెట్లు ఎక్కువ రేట్లకు అమ్మేస్తాను. ఒకోసీటు, బెర్తు రిజర్వేషన్సులో ముగ్గురికి, నలుగురికి ఇచ్చేస్తాను. వచ్చే ఫోన్సు ఏవీ ఎత్తను. ప్రతి బండి 5 గం॥ లేటని నోటీసు బోర్డుమీద రాస్తాను. ప్యాసింజర్సుకు కాలక్షేపానికి వీడియో ఏర్పాటుచేస్తాను. ప్లాట్‌ఫారం మీదున్న క్యాంటీన్-తినుబండారాల రేట్లు పెంచేస్తాను. 5 గం॥ కాగానే మరో 5 గం॥లు ఇలా లేటు రాసుకుంటూ పోతాను. తెల్లారేసరికి నేనెలాగూ స్టేషన్ మాస్టరుగా వుండను కదా! —విస్మృపూటి శ్రీరామమూర్తి
(మహబూబాబాద్)
- రైల్వే స్టేషన్‌కి వెళ్ళగానే ఓ ఇద్దరు గేంగీల్ని ముందుగా మా ఇంటి పనులకై నియమిస్తాను. సాధ్యమయినంతవరకు ఆ రైల్వే ఫర్నిచర్‌కి వినియోగించుకుంటాను. వెంటనే ఓ రెండు పాసులు తీసుకునే ఏర్పాటు చేసుకుంటాను. పనిలో పనిగా రైల్వే వాచ్‌మెన్ని మా ఇంటికి వినియోగించుకుంటాను. వెంటనే మా టి.సి. లందరికీకూడా కోటులకి వున్న జేబులన్నిటిని లోతుగా కుట్టిస్తాను. తిరిగి రాత్రి ఇంటికివచ్చే సమయంలో "రైల్వే టార్చిలైటు సంపాదిస్తాను.
—యం.వి. సుబ్రమణ్యం
(విజయనగరం)

